క్లుప్తంగా

కె.వెంకటాపురంలో గడప గడపకు నేడు

కోటవురట్ల: కె.వెంకటాపురంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్.సీతారామరాజు తెలిపారు. ఉదయం 6 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుంటారని తెలిపారు. స్థానిక సమస్యలు వివరించేందుకు గ్రామస్తులు సిద్ధంగా ఉండాలని, అధికారులు ప్రజా ప్రతినిధులు, వలంటీర్లు విధిగా హాజరు కావాలని సూచించారు.

పరశురామ అవతారంలో జగన్నాథుడు



పరశురామ అవతారంలో దర్శనమిస్తున్న జగన్నాథుడు

మునగపాక: నాగులాపల్లి, మునగపాక గ్రామాల్లోని జగన్నాథస్వామి ఆదివారం పరశురామ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జగన్నాథుని నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జగన్నాథుని దర్శనం కోసం భక్తులు తరలివచ్చారు. ఈ నెల 29న పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు... పొక్లెయిన్, ట్రాక్టర్ సీజ్



మైన్స్ అధికారులు సీజ్ చేసిన పొక్లెయిన్, ట్రాక్టర్

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లిలో గ్రావెల్ తవ్వకాలకు వినియోగిస్తున్న పొక్లెయిన్‌తో పాటు ట్రాక్టర్‌ను మైన్స్ అధికారులు శనివారం రాత్రి సీజ్ చేశారు. వాడ్రాపల్లిలో అనధికారికంగా గ్రావెల్ తవ్వుతున్నట్టు అందిన ఫిర్యాదు మేరకు మైన్స్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఈ దాడిలో తవ్వకాలకు ఉపయోగించే పొక్లెయిన్, ట్రాక్టర్‌ను సీజ్ చేసి మునగపాక పోలీసులకు అప్పగించారు. సంబంధిత వాహనాలపై కేసు నమోదు చేసినట్టు అధికారులు తెలిపారు.

120 మందికి ఉచిత వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ బంగారయ్య

ఎస్.రాయవరం: వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యాన్ని పొందవచ్చని కేజీహెచ్ మాజీ ఆర్‌ఎంవో డాక్టర్ బంగారయ్య అన్నారు. బంగారయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అడ్డురోడ్డు పరిసర ప్రాంతంలో ప్రతి ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. వైద్య శిబిరానికి వస్తున్న రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తున్నారు. ఈ సందర్భంగా ఈ ఆదివారం 120 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి విశాఖపట్నం తరలించేందుకు ఏర్పాట్లు చేశారు.

బీజేపీ మండల అధ్యక్షునిగా నాయుడుబాబు



కూండ్రపు నాయుడుబాబు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండల బీజేపీ అధ్యక్షునిగా కూండ్రపు నాయుడుబాబు నియమితులయ్యారు. మండలంలోని భోగాపురానికి చెందిన నాయుడుబాబును ఆదివారం అచ్యుతాపురంలో నిర్వహించిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఎన్నుకున్నట్లు ప్రకటించారు. నియోజకవర్గ బీజేపీ అధ్యక్షుడు రాజాన సన్యాసినాయుడు, రాజాన రాజు, గొంతిన భక్త సాయిరాం, పల్లి రాజబాబు, మేరుగు కాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఝాన్సీ లక్ష్మీబాయికి ఘన నివాళి

అనకాపల్లి టౌన్: స్థానిక ఉదయకాంతి వృద్ధాశ్రమంలో పొట్టి శ్రీరాములు పరిరక్షణ సమితి జిల్లా గౌరవాధ్యక్షుడు పి.ఎం.ఎల్.నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం ఝాన్సీలక్ష్మీబాయి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకు ముందు విద్యార్థులకు లక్ష్మీబాయి జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులతో పాటు బిస్కెట్లు అందజేశారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
✆ 9966329167, 9912440601
సాక్షి

ధ్రువపత్రాల జారీలో సవరణలు చేయాలి

నాయీ బ్రాహ్మణుల వినతి



చైర్మన్‌ను కలసిన రామకృష్ణ తదితరులు

నక్కపల్లి: ధ్రువపత్రాల జారీలో నాయీ బ్రాహ్మణులకు సంబంధించి కొన్ని సవరణలు చేసి జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని నక్కపల్లి మండలానికి చెందిన నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు ఆదివారం రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కాపవరకు శ్రీదేవిని కోరారు. మండలంలో దేవవరం గ్రామానికి చెందిన వీరేశ్వరపు రామకృష్ణ, తదితరులు చైర్‌పర్సన్ శ్రీదేవిని విజయవాడలో కలిసారు. నాయి బ్రాహ్మణుల్లో క్షౌ ర వృత్తిని చేస్తూ వాయిద్య కళాకారులు(భజంత్రీలుగా జీవించే వారు కూడా ఉన్నారన్నారు. ప్రభుత్వం వారు నాయి బ్రాహ్మణులకు జారీ చేసే కుల ధ్రువపత్రాల్లో భజంత్రీలు, మంగలి అని పేర్కొంటూ ధ్రువపత్రాలు జారీ చేస్తున్నారన్నారు. భజంత్రీలు అనేది వృత్తికి సంబంధించినదని, కులానికి సంబంధించినది కాదన్నారు. ధ్రువపత్రాలు జారీ చేసే సందర్భంలో నాయిబ్రాహ్మణ బీసీఏ కింద ధ్రువపత్రాలు జారీ చేయాలని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణ కార్పోరేషన్ చైర్మన్ శ్రీదేవి మాట్లాడుతూ దేవాలయాల్లో ఖాళీగా ఉన్న వాయిద్య కళాకారుల పోస్టులు భర్తీ చేయాలని, ధ్రువపత్రాల్లో మంగలి, భజంత్రీ పేరులు తొలగించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని కోరడం జరుగుతుందని, నాయీ బ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. నాయీ బ్రాహ్మణుల్లో నిరుద్యోగులైన యువతీ యువకులకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ద్వారా బ్యూటీషియన్ కోర్సులు నేర్పించి ఉపాధి కల్పించాలని కోరతామన్నారు. పేద నాయీ బ్రాహ్మణులు నిర్వహించే సెలూన్లకు 150 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అమలు చేసే జీవోను వెంటనే అమల్లోకి తెచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చైర్మన్ తెలిపారన్నారు. చైర్మన్‌ను కలసిన వారిలో వీరేశ్వరపు నానాజీ, వీరబాబు తదితరులు ఉన్నారు.

జిల్లాలో నేతన్న నేస్తానికి 270 దరఖాస్తులు

లబ్ధిదారుల గుర్తింపునకు సర్వే



లబ్ధిదారుల ఇళ్ల వద్ద తనిఖీ చేస్తున్న ఏడీ మురళీకృష్ణ

నక్కపల్లి: జిల్లాలో నేతన్న నేస్తం పథకానికి 270 దరఖాస్తులు వచ్చాయని చేనేత జౌళి శాఖ ఏడీ మురళీకృష్ణ, డీవో రమణమ్మ తెలిపారు. ఆదివారం వారు నక్కపల్లిలో వీవర్స్ కాలనీలో నేతన్న నేస్తానికి సంబంధించిన దరఖాస్తులను పరిశీలించారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారి మగ్గాలను, లబ్ధిదారులు ఇదే వృత్తిలో కొనసాగుతున్నారా లేదా అనే వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది జిల్లాలో 250 నేతన్న నేస్తం పథకానికి అర్హత సాధించారన్నారు. వీరందరికీ రూ.24వేలు చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయం వారి ఖాతాల్లో జమ చేసిందన్నారు. ఈ ఏడాది 270 దరఖాస్తులు వచ్చాయన్నారు. 20 దరఖాస్తులు అర్హత సాధించే అవకాశం లేదన్నారు. వీటిని ఇన్ ఎలిజబుల్‌గా పరిగణిస్తామన్నారు. అర్హత సాధించిన లబ్ధిదారులకు త్వరలోనే నేతన్న నేస్తం ఆర్థిక సాయం అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు బంగార్రాజు ఉన్నారు.

తీరంలో అలల ఉధృతి



తీరంలో ఎగిసి పడుతున్న అలలు

ఎస్.రాయవరం: అల్ప పీడనం ప్రభావంతో మండలంలో మేఘావృతం అయ్యి ఆదివారం చల్లని వాతావరణం నెలకొంది. ఉదయం చిరు కురిసిన తరువాత ఆకాశం మబ్బులు కమ్ముకుని చల్లగాలులు వీచాయి. ఇక రేవుపోలవరం, బంగారమ్మపాలెం గ్రామాల్లో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లలేదు. తీరంలో కూడా మబ్బులతో కూడిన వాతావరణం నెలకొంది. కెరటాల తీవ్రత మాత్రం పెద్దవిగా రావడంతో మత్స్యకారులు ఒడ్డున ఉన్న తెప్పలు మరింత సురక్షిత ప్రాంతాలకు తరలించుకున్నారు.

తేలికపాటి వర్షం

రాంబిల్లి: మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం తేలికపాటి వర్షం కురిసింది. ఉదయం 6 గంటల సమయంలో తేలిక పాటి చినుకులు పడ్డాయి. రోజంతా ఆకాశం మేఘావృతమైంది. అయితే ఆశించిన స్థాయిలో వర్షం పడలేదు. దీంతో రైతులు నిరాశ చెందారు. వర్షం పడితే నారు మడి దుక్కి పనులు మరో సారి చేసి విత్తనాలు వేసుకుందామని రైతులు భావిస్తున్నారు. అయితే వరణుడు కనికరించడం లేదు.

నిలిచిపోయిన వాటర్ ట్యాంకు పనులు



దిమిలిలో నిర్మిస్తున్న వాటర్ ట్యాంకు

రాంబిల్లి: దిమిలి గ్రామంలో నిర్మిస్తున్న వాటర్ ట్యాంకు పనులు నిలిచిపోయాయి. జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.87 లక్షలతో ఈ ట్యాంకు, పైప్పు లైను పనులు చేపట్టారు. అయితే పనులు దాదాపు 8 నెలల క్రితం ప్రారంభించారు. ట్యాంకు నిర్మాణం పూర్తి కాకుండానే శివాలయం వీధిలో ఇష్టానుసారం పైపులైను కోసం యంత్రసాయంతో రోడ్డును తవ్వేశారు. దీంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ట్యాంకు పనులు నిలిపి వేయడంతో గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 90వేల లీటర్ల సామర్థ్యం గల ఈ ట్యాంకు నిర్మాణ పనులు పూర్తి అయితే తాగునీటి ఇబ్బందులు తప్పుతాయని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ విషయాన్ని ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ వర్మ వద్ద ప్రస్తావించగా బిల్లులు విషయంలో జాప్యం కారణంగా పనులు కాంట్రాక్టర్ నిలిపివేశారన్నారు.

బ్రాండిక్స్‌లో 395 మందికి వైద్య పరీక్షలు



కళ్లద్దాలు అమర్చుతున్న దృశ్యం

అచ్యుతాపురం (అనకాపల్లి): బ్రాండెక్స్ అపెరల్ పార్కులో ఆదివారం చేపట్టిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 395 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 303 మందికి ఉచితంగా కళ్లద్దాలు అందజేశారు.79 మందికి మందులు అందజేశారు. 29 మంది కాటరాక్ట్ సర్జరీ చేయించుకోవాలని సూచించారు. శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కంటి శిబిరంలో భాగంగా విచ్చేసిన వారికి మజ్జిగ, ఫలహారం, భోజన వసతులు కల్పించారు. ఈ సందర్భంగా బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి మాట్లాడుతూ ఇప్పటి వరకూ 109 కంటి వైద్య శిబిరాలను నిర్వహించామని తెలిపారు. సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా ప్రజల ఆరోగ్య సంరక్షణకు అండగా నిలవాలనేది తమ లక్ష్యం అని అన్నారు.

ఇక సాఫీగా ప్రయాణం

- నరసింగబిల్లి రైల్వే గేటు వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణానికి సన్నాహాలు
- రూ.52 కోట్లతో అంచనా
- మూడు మండలాల ప్రజలకు సౌకర్యం



ఫ్లై ఓవర్ నిర్మించనున్న నరసింగబిల్లి రైల్వే గేటు

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి రైల్వే గేటు వద్ద ఫ్లైఓవర్ నిర్మాణానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. నరసింగబిల్లి–కొండకర్ల రహదారిలో వంతెన నిర్మాణానికి రూ.52 కోట్లు ఖర్చవుతుందని రైల్వే శాఖ అధికారులు అంచనా వేశారు. దీని నిర్మాణం పూర్తయితే ప్రధానంగా మూడు మండలాల ప్రజలకు ఆటంకం లేకుండా రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది.

రైల్వే గేటు వద్ద నిరీక్షణ

నరసింగబిల్లి రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే గేటు రైళ్ల రాకపోకల సమయంలో తరచుగా మూసి ఉంటోంది. దీని వల్ల ఈ మార్గంలో రాకపోకలు సాగించే ద్విచక్ర వాహన చోదకులు, ఆటోలు, కార్లు, పెద్ద వాహనాలు నడిపే వారు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఈ గేటు విశాఖ–విజయవాడ మధ్య ఉన్న ప్రధాన రైలు మార్గంలో ఉంది. ఈ దారిలో రోజుకూ సుమారుగా 200 వరకు రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. ఒక రైలు వచ్చినప్పుడు గేటు వేస్తే సుమారు పది నిమిషాల పాటు వాహన చోదకులు నిరీక్షించాల్సి వస్తోంది. అదే రెండు రైళ్లకు అయితే పావుగంట పాటు నిరీక్షించాలి. గూడ్స్ రైళ్లు, ఒక్కోసారి మూడు రైళ్లు దాటేటప్పుడు ఇంకా ఎక్కువ సమయం పాటు వేచి ఉండాల్సిందే. దీంతో వాహన చోదకులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. సకాలంలో తమ గమ్యాలకు చేరలేకపోతున్నామని, అత్యవసర పరిస్థితిలో మరింత ఇబ్బందులు గురి కావలసి వస్తోందని వాపోతున్నారు. ఇటువంటి పరిస్థితిలో ఇక్కడ ఫ్లై ఓవర్ నిర్మించాలని చాలా కాలంగా ఈ ప్రాంత ప్రజలు, వాహన చోదకులు అధికారులను కోరుతూ వస్తున్నారు.

అధికారుల సన్నాహాలు

ఈ నేపథ్యంలో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉన్న రైల్వే గేటు వద్ద ఫ్లై ఓవర్ వంతెనలు నిర్మించాలని రైల్వే శాఖ అధికారులు భావిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే నరసింగబిల్లి గేటు రోడ్డు, భవనాల శాఖకు చెందిన నరసింగబిల్లి–కొండకర్ల రోడ్డు మధ్య ఉంది. దీంతో ఫ్లై ఓవర్ వంతెన నిర్మాణానికి రోడ్లు, భవనాల శాఖ అధికారులు కూడా తమ పరంగా రైల్వే శాఖకు సహకారం అందించారు. రైల్వే అధికారులు అంచనాలు రూపొందించి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నారు. మండల గ్రామస్తులు, మునగపాక, అచ్యుతాపురం ప్రాంతాలకు రాకపోకలు సాగించడానికి నరసింగబిల్లి–కొండకర్ల రోడ్డు దగ్గరి మార్గం. ఈ నేపథ్యంలో వంతెన నిర్మాణం పూర్తయితే ఆయా మండలాల గ్రామాల ప్రజలు సాఫీగా ప్రయాణాలు సాగించేందుకు ఆటంకం లేకుండా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

రామన్నపాలెంలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని రామన్నపాలెంలో ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శ్రీ విష్ణు ఆస్పత్రి, ఇసాన్ ఆస్పత్రి, సన్‌రైజ్ డయాగ్నస్టిక్స్, సురక్షా హెల్త్ ఫౌండేషన్, హెచ్‌సీజీ క్యాన్సర్ ఆస్పత్రి, కిమ్స్ ఐకాన్ ఆస్పత్రుల సహకారంతో నిర్వహించిన ఈ వైద్య శిబిరాన్ని ఎంపీటీసీ లాలం శ్రీను, ధర్మిరెడ్డి నాయుడుబాబు మీదుగా ప్రారంభించారు. 130 మందికి బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో, పాప్ స్మియర్, బోన్ మినరల్ డెన్సిటీ పరీక్ష, దంత, చర్మ సంబంధిత వ్యాధులకు సంబంధించి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వైద్యులు అడిగర్ల సుధీర్, ధర్మిరెడ్డి వెంకటేష్, సందీప్, వాసుబాబు, కన్నుంనాయుడు వైద్య పరీక్షలు చేశారు.

సేవా కార్యక్రమాలు చేపడతాం



వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని ఎం.జగన్నాథపురంలో సేవా కార్యక్రమాల నిమిత్తం స్థలం కేటాయించాలని రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులు స్థానిక సర్పంచ్ కొరెడ్ల బుల్లెమ్మకు ఆదివారం వినతి పత్రం అందజేశారు. ఆర్మీ ఉద్యోగుల ఆధ్వర్యంలో భవనం నిర్మించి సేవా కార్యక్రమాలు చేపడతామని దీనికి స్థలం కేటాయించాలని వారు కోరారు. మాజీ సర్పంచ్ భీముని వెంకటేశ్వరరావు, ఆర్మీ ఉద్యోగులు పాల్గొన్నారు.

‘జగనన్న సురక్ష’తో సమస్యలకు చెక్



జగనన్న సురక్ష కార్యక్రమంపై సమీక్షిస్తున్న అధికారులు

కోటవురట్ల: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సమస్యలు మరింత వేగంగా పరిష్కారానికి నోచుకుంటాయని ఏవో చంద్రశేఖర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహణపై అధికారులు సమావేశమయ్యారు. గ్రామాల్లో సర్వే, సమస్యల పరిష్కారానికి తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. ఏవో మాట్లాడుతూ జూలై ఒకటో తేదీ నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా 11 రకాల సేవలు సత్వరమే అందేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కార్యదర్శి సుబ్రహ్మణ్యం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూకాంబిక దర్శనానికి పోటెత్తిన భక్తులు

అనకాపల్లి టౌన్: పట్టణంలో గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారికి ప్రీతీపాత్రమైన రోజు ఆదివారం కావడంతో అనకాపల్లితో పాటు విశాఖ, విజయనగరం జిల్లాల వాసులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కొంత మంది భక్తులు ఆలయ ఆవరణలో ఉన్న చలువ పందిళ్లలో వంటలు చేసుకుని అమ్మవారికి నివేదించి కుటుంబ సమేతంగా భోజనాలు చేశారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు ఆలయానికి వచ్చే భక్తులకు ఉచిత మజ్జిగ, తాగునీరు అందజేశారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతికి సంతాపం

మునగపాక : మండలంలోని కాకరాపల్లి వైఎస్సార్‌సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు మొక్క అప్పలరెడ్డి (53) ఆదివారం మృతి చెందాడు. ఆయన కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ విశాఖ కేజీహెచ్‌లో మృతిచెందారు. స్వగ్రామం కాకరాపల్లిలో అప్పలరెడ్డి అంత్యక్రియలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి అప్పలరెడ్డి ఎంతో కృషి చేశారు. అప్పలరెడ్డి మృతికి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, వైస్ ఎంపీపీ బోజా లక్ష్మీ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ, పార్టీ అధికార ప్రతినిధి మంగారెడ్డి తదితరులు సంతాపం తెలిపారు.

మూడు గ్రామాల్లో సోలార్ వెలుగులు



డీవీ సూర్యనారాయణరాజు, మాజీ ఎమ్మెల్సీ

కోటవురట్ల: మండలంలోని మూడు గ్రామాలలో సోలార్ వెలుగులు చిందించనున్నట్టు మాజీ ఎమ్మెల్సీ డి.వి. సూర్యనారాయణరాజు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కోటవురట్ల, కైలాసపట్నం, బోడపాలెం గ్రామాలలో నెడ్‌క్యాప్ ద్వారా సోలాల్ వీధి దీపాలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఇందు కోసం ఎంపీ నిధులు రూ.15 లక్షలు వినియోగిస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా నెడ్‌క్యాప్ డీఎం ఎం.వి.రాజు సోలార్ లైట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించడమే కాకుండా గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేస్తోందన్నారు. ప్రతిపక్షాలు అంధకారంలో ఉన్నాయని, జరుగుతున్న అభివృద్ధి, అందుతున్న సంక్షేమం వారి కళ్లకు కనిపించడం లేదన్నారు. రహదారుల అభివృద్ధికి కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, దశల వారీగా పనులు జరుగుతాయని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమాన్ని అందిస్తున్నారని, గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా లంచగొండితనాన్ని నిర్మూలించారన్నారు. అవినీతి రహిత రాష్ట్రం ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. కొత్తగా శ్రీకారం చుట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ధ్రువపత్రాల జారీలో నెలకొన్న సమస్యలు సత్వర పరిష్కారానికి నోచుకుంటాయన్నారు. ఇంత పారదర్శకమైన పాలన గతంలో ఎవరూ అందించలేదన్నారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి, సంక్షేమాన్ని రాష్ట్ర ప్రజలు చూస్తారన్నారు.

శ్రీ సఖి సేవా సమితి ఉదారత



విద్యార్థులతో సేవా సమితి సభ్యులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురంలోని ఇంటిగ్రేటెడ్ వికలాంగుల ఆశ్రమ విద్యార్థులకు రూ. లక్షా యాభై వేలు విలువ చేసే నోటు పుస్తకాలు, స్టేషనరీ, బియ్యం, కూరగాయలను విశాఖపట్నం మురళీనగర్‌కు చెందిన శ్రీ సఖీ సేవా సమితి సభ్యులు ఆదివారం అందజేశారు. ఆశ్రమ నిర్వాహకులు పీఎస్‌టీ పట్నాయక్ సమక్షంలో శ్రీ సఖీ సేవా సమితి వ్యవస్థాపకురాలు బిందు రాణి చేతుల మీదుగా అందజేశారు. బిందు రాణి మాట్లాడుతూ అచ్యుతాపురం ఆశ్రమానికి తాము ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడం ఎంతో సంతోషంగా ఉందని, పట్నాయక్ వంటి ఉదారత కలిగిన వ్యక్తుల ఆధ్వర్యంలో ఆశ్రమ విద్యార్థులకు మేలు జరుగుతుందని తెలిపారు.

జగనన్న సురక్ష ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారం



తిమ్మరాజుపేటలో జగనన్న సురక్ష పథకంపై అవగాహన కల్పిస్తున్న ఉప సర్పంచ్ జగన్

మునగపాక: జగనన్న సురక్ష కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలని తిమ్మరాజుపేట సర్పంచ్ కాండ్రేగుల జగన్ కోరారు. ఆదివారం ఆయన వలంటీర్లతో కలిసి సురక్ష పథకంపై అవగాహన కల్పించడంతో పాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హత ఉండి ఇంతవరకు ప్రభుత్వ పథకాలు దక్కని వారికి మరో అవకాశం కల్పించారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో వలంటీర్లు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఫౌండేషన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



రైతులకు వరి విత్తనాలు అందజేస్తున్న అరబుపాలెం సర్పంచ్ శ్రీనివాసరావు

మునగపాక: ఎస్‌బీఐ ఫౌండేషన్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అరబుపాలెం సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు కోరారు. అరబుపాలెంలో ఆదివారం ఎస్‌బీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 150 మంది రైతులకు రాయితీపై విత్తన పంపిణీ నిర్వహించారు. బస్తా రూ.1250 కాగా రైతులు తమ వాటాగా రూ.400 చెల్లించేలా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎస్‌బీఐ ఫౌండేషన్ ద్వారా ఇప్పటికే గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రైతుల సంక్షేమం కోసం పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సీజన్‌లో రైతులకు అవసరమయ్యే సేవలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఏరియా అధికారి కె.శ్రీకాంత్, ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ డి.నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలి



మాట్లాడుతున్న బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సన్యాసినాయుడు



కొప్పుగొండుపాలెంలో ఇంటింట ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

మునగపాక: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన సన్యాసినాయుడు కోరారు. మునగపాక పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో ఆదివారం బీజేపీ ముఖ్యనేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత ప్రధానమంత్రి నరేంద్రమోదీకే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు పట్టంకట్టాలన్నారు. సమావేశంలో పార్టీ నేతలు వేగి సోమేశ్వరరావు, పాలమరశెట్టి నాగేశ్వరరావు, మళ్ల రామజోగినాయుడు, దొడ్డి వెంకట సత్యనారాయణ, వేగి అప్పలనాయుడు, కారు శాంతకుమార్, అప్పికొండ సన్యాసిరావు పాల్గొన్నారు.

బీజేపీ మండల పార్టీ అధ్యక్షునిగా రాజేశ్వరరావు

మునగపాక మండల బీజేపీ అధ్యక్షునిగా యల్లపు రాజేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల పార్టీ నూతన కార్యవర్గం ఎంపిక పార్టీ పెద్దల సమక్షంలో నిర్వహించారు. అధ్యక్షునిగా రాజేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా దేవర శివ సూరప్పారావు ఎన్నికయ్యారు.

రాంబిల్లి: ప్రధాని మోదీ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మండల అధ్య క్షుడు కారె రాముడు అన్నారు. ఆదివారం కొప్పుగొండుపాలెం, గోవిందపాలెం, చినకలవలాపల్లి గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోవిందరెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి వృథా పట్టదా?..



సంతబయలు వద్ద వీధిలో కుళాయి నుంచి వృథాగా పోతున్న తాగునీరు

కోటవురట్ల: పలు వీధుల్లో తాగునీరు వృథాగా పోతోంది. రక్షిత మంచినీటి పథకాల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో తరచూ ఇవే దృశ్యాలు కనిపిస్తున్నాయి. స్థానిక సంతబయలు సమీపంలోని ఓ వీధిలో రక్షిత మంచినీటి పథకం కుళాయికి ట్యాప్ లేకపోవడంతో తాగునీరు నేలపాలవుతోంది. ఇది సచివాలయానికి వంద మీటర్ల దూరంలోనే ఉండడం గమనార్హం. పలు గ్రామాలలో తాగునీరు లేక అవస్థలు పడుతుంటే ఇక్కడ మాత్రం వందల లీటర్ల నీరు వృథా అవుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

